విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 3, డిసెంబర్ 2023

వైసీపీ నేతలు విగ్రహ రాజకీయాన్ని మానుకోవాలి..

.. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: కామ్రేడ్ విమలా ఫరూక్ నగర్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ నిర్మాణాన్ని వైసీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. శుక్రవారం తెల్లవారు జామున మాజీ ముఖ్యమంత్రి విగ్రహ నిర్మాణంపై జరిగిన గందరగోళంపై జాఫర్ ఘాటుగా స్పందించారు. దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగిన చందంగా 2011లో విగ్రహ నిర్మాణానికి అప్పటి కలెక్టర్ అనుమతులిస్తే వైసీపీ నాయకులు ఇప్పుడు విగ్రహం పెట్టాలని చూడటం సరికాదని గుర్తు చేశారు. కమ్యూనిస్టు నాయకురాలు కామ్రేడ్ విమలా ఫరూక్ పేరుతో కాలనీని నిర్మిస్తే అక్కడి ప్రజలతో చర్చించకుండా రాత్రికి రాత్రే కాంగ్రెస్ నాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం వైసీపీ నాయకుల తెలివితక్కువ తనానికి నిదర్శనమని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ, టీడీపి, జనసేన పార్టీల నాయకులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించాలి

వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తాం

సిపిఐ నగర కార్యదర్శి ఎన్. శ్రీరాములు

విశాలాంధ్ర–అనంతపురంఅర్బన్ : అనంతపురంలోని విములాఫరూక్ నగర్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాఏర్పాటు చేయకూడదని వామపక్షాలైన భారత కమ్యూనిస్ట్ పార్టీ, టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి ఎన్. శ్రీరాములు మాట్లాడుతూ అర్ధరాత్రి దొంగలు తిరిగే సమయంలో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి విగ్రహం పెట్టడం సిగ్గుచేటన్నారు. శుక్రవారం కూడా సిపిఐ పార్టీగా విగ్రహం పెట్టడాన్ని వ్యతిరేకించామని, పర్మిషన్ తీసుకోని మాజీ ముఖ్య మంత్రిని అవమాన పరచకుండా సక్రమంగా విగ్రహాన్ని పెట్టాలన్నారు. చనిపోయిన వ్యక్తికి ఆత్మ క్షోభించే విధంగా ఈ రాష్ట్రంలో వైయస్ఆర్ నాయకులు అవలంబిస్తున్నారు. అనంతపురంలోని ప్రధాన రోడ్డు సప్తగిరి సర్కిల్ నుంచి టవర్ క్లాక్ వరకు అనేక కూడళ్లిలో ఉండే చాలామంది మహనీయుల విగ్రహాలని దాదాపు మూడేళ్ల క్రితం రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించడం జరిగిందన్నారు. నేటికీ ఆ మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయలేదని, గతంలో కలెక్టరేట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఫెర్రర్ విగ్రహాన్ని తొలగిస్తే ఒక్క వైస్సార్సీపీ పార్టీ తప్ప ప్రజాసంఘాలు, అఖిలపక్ష పార్టీలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తే కలెక్టరేట్ ఆఫీస్ ఎదురుగా ఫెర్రర్ విగ్రహాన్ని పెట్టారన్నారు. ఇటువంటి దుర్మార్గమైన పాలన ఈ రాష్ట్రంలో నేటికీ కొనసాగు తోందన్నారు. అభివృద్ధి, ప్రజాసమస్యలను పట్టించుకోరు కానీ చనిపోయిన మహనీయుల విగ్రహాలను దొంగచాటున దొడ్డిదారిలో పెట్టడానికి వైస్సార్సీపీ ప్రభుత్వం పూనుకుంటోందన్నారు. రాష్ట్రంలో వైస్సార్సీపీ విలువలు, ఉనికి కోల్పోయారని, పక్క రాష్ట్రాలలో కాంగ్రెస్ వస్తోంది కాబట్టి రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని వాడుకొని ఎన్నికలలో గెలిచి అధికారంలోకి రావాలని జగన్మోహన్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారన్నారు. అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌ని కలుస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శులు అల్లీపీరా, రమణయ్య, టీడీపీ క్లస్టర్ ఇంచార్జి గోపాల్‌గౌడ్, ఎస్ఎం.బాషా, బాలప్ప, వడ్డే మురళి, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, కాంగ్రెస్ పార్టీ నగరఅధ్యక్షులు శర్మస్ వలి, ఇమామ్, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి ఖుషిదా, నగర కార్యవర్గ సభ్యులు మునాఫ్, బాలయ్య, రామయ్య, రజాక్, రహమతుల్లా, నాగప్ప, రాజు, రవి, ఎల్లుట్ల నారాయణస్వామి, సూరి, విములాఫరూక్ నగర్ మాజీ ఎంపీటీసీ వరలక్ష్మి, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు అంజి, నాగభూషణ, వెంకట రాముడు, కుమారనాయుడు, నాగ, వెంకటేశ్వర్లు, అఖిల్, జనసేన నాయకులు ధనుంజయ, కిరణ్ కుమార్, రాజ్, భాష, అంజి, సంపత్, అశోక్, లాలస్వామి, రమణ పాల్గొన్నారు.

ఘనంగా సర్మస్ హుస్సేనీ ఉరుసు

విశాలాంధ్ర–బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు సర్మస్ హుస్సేనీ స్వాముల ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం నుంచి అనేక ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారికి చాదర్, పూల మాలలు, చక్కెర సమర్పించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలకు దర్గా ఆవరణలో చక్కెర తూకాలతో మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసివచ్చి దర్గా ఆవరణలో కందూరిలు నిర్వహించుకున్నారు. స్థానిక మాజీ సర్పంచ్ కేశప్ప, టిడిపి నాయకులు బంధుమిత్రులతో చక్కెర చదివింపులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలిరావడంతో దర్గాహొన్నూరు కిక్కిరిసింది. ఎస్ఐ శివ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. నేటి ఆదివారం ఉదయం తెల్లవారుజామున సర్మస్ హుస్సేనీ షంషేర్ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

పీపుల్స్‌వార్ నాయకుడు బండయ్యకు సతీ వియోగం

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

విశాలాంధ్ర–ఉరవకొండ: దివంగత పీపుల్స్ వార్ నాయకులు బండయ్యా మాస్టర్ భార్య పక్కిరమ్మ (90) శనివారం వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి చాబాల గ్రామానికి చేరుకుని పక్కిరమ్మ మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట చంద్ర, సర్పంచ్ జగదీష్, డోనేకల్ రమేష్, నారాయనప్ప, గోవర్ధన్, చక్రిస్వామి, మోహన్, రామచంద్ర, మల్లేష్, సూరి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడిద్దాం

- నియోజకవర్గ పరిశీలకులు రమణారెడ్డి

విశాలాంధ్ర–అనంతపురం రూరల్: టిడిపి అధినేత మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించి సీఎం జగన్‌ను గద్దె దింపుదామని టిడిపి అర్బన్ నియోజకవర్గం పరిశీలకుడు రమణారెడ్డి పిలుపు నిచ్చారు. బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా శనివారం 35వ డివిజన్ మంగళవారికాలనీలో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు పథకాల గురించి వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగన్నరేళ్లలో హామీలు అమలు కాకపోయినా దౌర్జన్యాలు, దోపిడీలు, అక్రమాలు చేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జి పరిమి రాజారావు, జె.ఎం.బాషా, అంజి, మల్లేష్, గౌనీయా, నరేష్ పాల్గొన్నారు.

ఎస్కేయూ భూ కబ్జా వైకాపా నాయకులపై కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర–జెఎన్‌టియుఏ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 5 ఎకరాల భూమి కబ్జా చేసిన వైకాపా నాయకులపై కేసు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన్న, ఎన్ ఎస్‌యుఐ రాష్ట్ర నాయకుడు పులిరాజు పేర్కొన్నారు. శనివారం విశ్వవిద్యాలయం భూకబ్జాపై అధికారుల నిర్లక్ష్యపు వైఖరి నిరసనగా రిజిస్ట్రార్ కార్యాలయంలో విద్యార్థి సంఘం నాయకులు నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. మాజీ వీసి రామకృష్ణారెడ్డి పదవి ముగియనున్న రెండ్రోజుల్లో జగనన్న లేఔట్ కు అనుమతి ఇవ్వడం విశ్వవిద్యాలయ ప్రగతిని అగాధంలో పడేసారన్నారు. పాలకమండలి సమావేశంలో విశ్వవిద్యాలయం భూమిపై చర్చించగా సభ్యులు దీనిని తిరస్కరిం చారని అన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎం.నాగార్జున

విశాలాంధ్ర–రాయదుర్గం అర్బన్: కరువుతో కకావికలం అవుతున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎం. నాగార్జున అన్నారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో పాదయాత్రలో తాము అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారని, ఇప్పుడేమే జిపిఎస్ అంటున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఛతీస్‌గఢ్ జార్ఖండ్, పంజాబ్, లాంటి రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేశాయని ఇక్కడ ఓపిఎస్ తీసుకురావాలని, అందుకు ఉద్యమాలు చేసిన ఫలితం శూన్యమన్నారు. చివరికి లాఠీ చార్జీలు, కేసులు, అరెసులు జరుగుతున్నా యన్నారు. ఇక జాబ్ క్యాలెండర్ విషయానికి వస్తే దాదాపు నాలుగున్నర సంవత్సరాల అయినా ఒక్కసారి మాత్రం పదివేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశారన్నారు. మరి ఆ దిశ లేదు, దశ లేదని అది కూడా మెడికల్ హెల్త్ పోస్టులు రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలో రెండు లక్షలు పైచిలుకు ఖాళీ ఉద్యోగాలు దర్శనమిస్తున్నాయన్నారు. ముఖ్యం గా గ్రూప్ 1.2.3.4 పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయని, ఉపాధ్యాయుల పోస్టులు 25వేల పైచిలుకు కాళీ అయ్యాయని, ఇంతవరకు ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించ లేదన్నారు. వీటి గురించి పోరాటం చేస్తే జీవో నెంబర్ వన్ ద్వారా ప్రభుత్వం అణిచివేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా లేదని, పోలవరం నిర్మాణం పూర్తికాని పరిస్థితి నెలకొందని, రాజధానికి నిధులు ఇవ్వని పరిస్థితి నెలకొందని, రాజధాని ఏదో తెలియని పరిస్థితి, కడప ఉక్కు కర్మాగారం రామా యపట్నం, ఓడరేవు, విశాఖ రైల్వే జోన్, జాతీయ విద్యా సంస్థల నిర్మాణం ఏడు వెనుకబడిన జిల్లాలో ప్రత్యేక ప్యాకేజీ సహాయం ఇవేమీ కూడా ఇచ్చినమాట నిలబెట్టుకోక అమలుచేయని పరిస్థితి ఉందన్నారు. సమావేశంలో సిపిఐ నాయకులు నాగరాజు, వ్య.కా.సం తాలూకా అధ్యక్షులు ఎన్.నరసింహులు, సిపిఐ తిప్పేస్వామి, ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి పాల్గొన్నారు.

మున్సిపల్ అవుట్సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

విశాలాంధ్ర–అనంతపురం అర్బన్ : మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి అధికారంలోకి రాకముందు ఒక మాట.. వచ్చాక ఇంకోమాట మాట్లాడుతున్నారన్నారు. మున్సిపల్ కార్మికులకు 15 వేల వేతనం ఇస్తూ సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ఇంబ్బందులకు గురిచేస్తున్నారు. పర్మినెంట్ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి మాట తప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజులలోనే సీపీఎస్ రద్దు చేస్తామన్నారు. ఎన్నికలు దగ్గరకు వస్తున్నా జీపీఫ్ అని రోజుకో పేరుతో ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారన్నారు. స్కూల్ స్వీపర్స్, వాచ్మెన్లకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. సమస్యలపై ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.చిరంజీవి,కోశాధికారి వేణు, సమితి సభ్యులు శివకృష్ణ, ఎర్రప్ప, అసేన్ పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీలో మైక్రో బయాలజీ కల్చర్ పరీక్షలు ప్రారంభం

రోగం నయం చేయడంలో కల్చర్ పరీక్షలు కీలకం

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి లోని రోగులకు సూక్ష్మజీవుల వ్యాధి నిర్ధారణ కల్చర్ పరీక్షలు, ఇకనుంచి ఆ ఆసుపత్రిలోనే మైక్రో బయాలజీ విభాగంలో చేయనున్నామని, బ్యాక్టీరియా, ఫంగస్ కల్చర్ పరీక్షలు, ఆపరేషన్ థియేటర్స్ శ్వాబ్స్ కల్చర్స్ ఇక నుంచి ఇక్కడే చేయనున్నామని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆచార్య డాక్టర్ కే ఎల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. దీనికి సంబంధించిన అన్ని సదుపాయాలను మైక్రోబయాలజీ ల్యాబ్‌కు సమకూర్చామని, సోమవారం నుంచి అన్ని పరీక్షలు ఇక్కడే చేస్తున్నామని, వారం రోజులలో హెచ్ఐవి వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా ఇది ఆసుపత్రిలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంతవరకు జి జి హెచ్ మరియు ఎస్ఎస్‌హెచ్ ఆసుపత్రిలోని అందరు రోగులకు మెడికల్ కళాశాలలో మైక్రో బయాలజీ డిపార్టుమెంట్లో పరీక్షలు చేసేవారుమని ఇప్పుడు ఆ పరీక్షలను సూపర్ స్పెషాలిటీలోని ఏర్పాటు చేశామని, ఇది రోగులకు డాక్టర్లకు చాలా సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూపర్ స్పెషాలిటీ డాక్టర్లకు తెలిపారు. ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్ మాణిక్యరావు మాట్లాడుతూ మెడికల్ కళాశాల నుంచి ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక సీనియర్ రెసిడెంట్ ను, ఇద్దరు పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ ను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మైక్రోబయాలజీ విభాగానికి పంపిస్తున్నామని తెలిపారు. మరిన్ని సేవలను మైక్రో బయాలజీ విభాగం వారు అందుబాటులోకి తీసుకు రావాలని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతిరెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ సుభాష్ చంద్రబోస్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సౌజన్య కుమార్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్లు డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్, డాక్టర్ రవి కుమార్, మైక్రో బయాలజీ డాక్టర్లు డాక్టర్ హైమావతి, డాక్టర్ సరోజ, డాక్టర్ శైలజ, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రత్న హారిక, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం : ఎస్పీ

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం : జిల్లాలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సారథ్యంలో ఇతర రాష్ట్రాల మద్యం, ఇసుక అక్రమ రవాణాలపై నవంబర్ నెలలో దాడులు కొనసాగాయి. ఇతర రాష్ట్రాల నుండీ జిల్లాలోకి అక్రమంగా మద్యం తరలించకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా.. జిల్లాలో నాటు సారా తయారీ, నిల్వ, అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా ఉంచారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. జిల్లా ఎస్పీ కెకేఎన్ అన్బురాజన్ ఆదేశాలు మేరకు సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ పర్యవేక్షణలో సెబ్, పోలీసు బృందాలు గత నెలలో జిల్లాలోకి అక్రమంగా ఇతర రాష్ట్రాల మద్యం రవాణా చేస్తుండటంపై దాడులు నిర్వహించి 26,753 టెట్రా పాకెట్లు, నాటు సారా తయారీకి ఉపయోగించే 3,065 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. 190 లీటర్ల నాటు సారా, 482 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కర్నాటక నుండీ జిల్లాలోకి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వారిపై 169 కేసులు నమోదు చేసి 197 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 09 కేసులు నమోదు చేసి 16 మందిని అరెస్టు చేశారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న 14 వాహనాలను సీజ్ చేశారు.

వైభవంగా శ్రీవారి పల్లకీ ఉత్సవం

విశాలాంధ్ర–ఉరవకొండ: మండలంలోని పెన్నాహెూబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకి ఉత్సవం కార్యక్రమం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహ స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలువు దీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

కన్నీరు పెట్టించిన సుధ మరణం

కళాశాల నాలుగో అంతస్తు నుండి కింద పడి దుర్మరణం

విశాలాంధ్ర–బొమ్మనహాళ్: మండలంలోని కల్లుహోళ గ్రామానికి చెందిన శంకర్ గౌడ్, రత్నమ్మ దంపతుల కుమారై సుధ(17) మృతితో గ్రామంలోని ప్రతి ఒక్కరినీ కన్నీరు పెట్టించింది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు శంకర్ గౌడ్, రత్నమ్మ దంపతులకు ఒక కుమారుడు మధు, కుమారై సుధ సంతానం. కుమారుడు మధు బెంగూరులోని ఓ ప్రైవేట్ కళశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. కుమారై సుధ అనంతపురం నగరంలోని నలంద ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం (సీఈసీ) చదువుతుండేంది. గజగౌరీ ఉత్సవాలు సందర్భంగా ఇటీవల కల్లుహోళ గ్రామానికి వచ్చి శుక్రవారం తిరిగి అనంతపురంలోని కళాశాలకు వెళ్లింది. వెళ్లినా కొన్ని గంటలకే రాత్రి 7.30 గంటలకు కళాశాల నాలుగో అంతస్తు నుండి కిందకు పడిందని, ఆసుపత్రికి తీసుకెళ్లుతున్నామని, కళాశాల నుంచి సమాచారం అందిందన్నారు. అక్కడికి వెళ్లి చూసే సరికే సుధ మృతి చెందిందని తెలిపారన్నారు. శనివారం సాయంత్రం సుధ మృతదేహాన్ని కల్లుహోళ గ్రామానికి తీసుకురావడంతో ఒక్కసారిగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇంజనీరింగ్ అవుతావనుకుంటే అప్పుడే కళ్లు మూశావా తల్లి అంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. శనివారం సాయంత్రం సుధ అంత్యక్రియలు గ్రామంలో ముగిసాయి. నలంద కళాశాల యజమాన్యం పైనే మాకు అనుమానం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు నిజాలను వెలికితీసి మా పాప మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

పీఏబీఆర్ ద్వారా తాగునీటితో పాటు సాగునీరు అందించాలి..

సిపిఐ.ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్

విశాలాంధ్ర–కూడేరు: పీఏబీఆర్ ద్వారా త్రాగునీటితోపాటు సాగునీరును మరియు మండలంలోని అన్ని చెరువులకు నీరును వదలాలని శుక్రవారం కూడేరు మండల కేంద్రంలోని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బీ.గోపాల్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కురుగుంట మనోహర్ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, పీఏబీఆర్ ద్వారా త్రాగునీటితో పాటు సాగునీరు రైతులకు అందుబాటులో తెచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన హార్టికల్చర్,అగ్రికల్చర్ పంటలకు నష్టపరిహారం చెల్లించాలి, కరువు సహాయక చర్యలు కింద తక్షణం ప్రత్యేక ప్యాకేజీని కేటాయించి రైతులను ఆదుకునే విధంగా సహాయక చర్యలు చేపట్టాలి, రైతుల రుణాలన్నీ రద్దుచేసి కొత్త రుణాలను మంజూరు చేయాలి, వ్యవసాయ భూముల్లో సాగులో ఉన్న ప్రతి రైతుకు అసైన్మెంట్ కమిటీలో అర్హత కల్పించాలని, ఉరవకొండ నియోజకవర్గంలో నిలిచిపోయిన మెగా డ్రిప్ ఇరిగేషన్ పనులు ప్రారంభించి వాటి ద్వారా రైతులకు నీరు అందించాలని, రైతాంగ సమస్యలు పరిష్కారం చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నారాయణమ్మ, రైతు సంఘం మండల కార్యదర్శి రమణ, మండల నాయకులు మల్ల రాయుడు, భీమన్న, ఖాసిం, పీరా, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా చిరంజీవి ఏకగ్రీవం

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: గురువారం జరిగిన ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూని యన్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ సుబ్బారాయుడు నూతన జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా జె.రాజారెడ్డి, జిల్లా అధ్యక్షులుగా జి.చిరంజీవి,కార్యనిర్వహ అధ్యక్షులు నరసయ్య,ఉపాధ్యక్షులు కొండయ్య, ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్,కార్యదర్శులు నాగరాజు,రఫీ,కోశాధికారి వేణుగోపాల్ వీరితోపాటు 25 మందిని జిల్లా సమితి సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

ఓటర్ల జాబితాలో పొరపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తేవాలి..

▸ జాయింట్ కలెక్టర్ ..

విశాలాంధ్ర–ఉరవకొండ: ఓటర్ల జాబితాలో ఎక్కడైనా పొరపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్గర్గ్ అన్నారు. శనివారం ఉరవకొండ తాసిల్దార్ కార్యాలయంలో ఓటర్ జాబితా తయారుకు సంబంధించి జరుగుతున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ నిబంధనలు అనుగుణంగా ఓటరు జాబితా తయారు చేస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, ఓటరు జాబితా పారదర్శకంగా ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా తయారు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తాహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలలో బాలాజీ ఫార్మసీ కళాశాల విజయకేతనం ..

విశాలాంధ్ర–జెఎన్‌టియుఏ: రైఫర్ కళాశాలలో ఫార్మసీ క్రీడలలో బాలాజీ ఆఫ్ ఫార్మసీ కళాశాల వాలీబాల్, త్రోబాల్, టెన్నిస్ కాయిట్ షార్ట్ విద్యార్థులు విజ య కేతనం ఎగరవేశారు. విద్యార్థులను కళాశాల వ్యవ స్థాపకుడు, మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, కళాశాల చైర్మన్ పల్లెకిషోర్, పల్లెసింధూరరెడ్డి అభినందించారు

బీసీసెల్ వైసీపీ మండలాధ్యక్షుడిగా పులకుర్తి చంద్ర

సన్మానం చేస్తున్న నాయకులు

విశాలాంధ్ర–డి.హీరేహాళ్: మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ అధ్యక్షుడిగా పులకుర్తి చంద్ర నియామకయ్యారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ మండలంలోని పార్టీ కార్యకలాపాలు, పార్టీ 2024 ఎన్నికలో మరొక్కసారి అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ విప్,రాయదుర్గం శాసన సభ్యులు కాపు రామచంద్రా రెడ్డికి, మండల పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ధన్య వాదాలు తెలిపారు.

తప్పుల తడకగా నూతన ఓటర్ల జాబితా

తప్పుల తడకగా నూతన ఓటర్ల జాబితా

సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలో నూతనంగా తయారైన ఓటర్ల జాబితా తప్పులు తడకలుగా రూపొందించారని సిపిఐ పార్టీ ముదిగుబ్బ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆరోపించారు. ఈ నెల 2,3వ తేదీలలో ఎన్నికల అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణలో భాగంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని శనివారం ముదిగుబ్బ మండలంలో కూడా నిర్వహించారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ ఓటర్ల జాబితా సవరణ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో మండల అఖిలపక్ష నాయకులతో కలిసి సీపీఐ నాయకులు కూడా ఓటర్ల జాబితా పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ నూతన ఓటర్ల జాబితాలో లెక్కకు మించి తప్పులు ఉన్నాయన్నారు, ఒకచోట ఉండాల్సిన పేర్లు మరోచోట ఉండడమే గాక కొందరి పేర్లు రెండు మూడు చోట్ల నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా డోర్ నెంబర్ ఆధారంగా సీరియల్‌గా ఓటర్ల జాబితాలో పేర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం అందుకు భిన్నంగా ఎక్కడబడితే అక్కడ ఇష్టానుసారంగా ఓటర్ల పేర్లు నమోదు చేయడం జరిగిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాగా చాలా మంది ఓటర్లు ప్రస్తుత జాబితాలో తమ పేరు ఎక్కడుందో తెలియక తికమక పడాల్సిన దుస్థితి ఏర్పడుతోందని సిపిఐ నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల అధికారులు ఏ పార్టీకి సంబంధం లేకుండా, నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా రూపొందించాల్సి ఉండగా వారు అధికార పార్టీ నాయకుల కనుసన్నలలో పనిచేస్తూ వాలంటీర్లను వెంటపెట్టుకొని వారు చెప్పిన విధంగా ఈ నూతన ఓటర్ల నమోదు, సవరణ కార్యక్రమం నిర్వహించి, అధికార పార్టీకి అనుకూలంగా ఉండేటట్లు తయారు చేశారన్నారు. ఎన్నికల అధికారులు కూడా ప్రేక్షక పాత్ర వహించడంతో ఈ పరిస్థితి దాపురించిందని సిపిఐ నాయకులు శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తుమ్మల మనోహర, నామాల కృష్ణమూర్తి, నల్లాని వెంకటనారాయణ, సీనయ్య గారి రమణ, డిష్ రామంజి, మల్లెల నారాయణ స్వామి, అనీఫ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాసినేని ప్రభాకర, మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయులు బాల భాస్కర, కంటగాని నారాయణస్వామి పాల్గొన్నారు.

15 పోలింగ్ బూత్‌లకు గాను నలుగురేనా బీఎల్‌ఓలు

ఆవేదన వ్యక్తం చేసిన ప్రతిపక్ష పార్టీలు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ మండల కేంద్రంలో ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు ప్రతిపక్ష పార్టీలో నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఓటరు జాబితా పరిశీలన చేశారు. ఆదివారం తెదేపా పట్టణ అధ్యక్షుడు తుమ్మల మనోహర్ మాట్లాడుతూ ఈ నెల రెండు, మూడు తేదీలలో మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యక్ష శిబిరాలు ఏర్పాటు చేసి పెండింగ్లో ఉన్న దరఖాస్తులు పరిష్కరించాలని తప్పులు లేకుండా ముసాయిదా ఓటర్ల జాబితా సరిదిద్దాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఎన్నికలకు సంబంధించిన అధికారులకు ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో ముదిగుబ్బ పట్టణంలోని 15 పోలింగ్ బూతులను పరిశీలించగా, 15 మంది బీఎల్‌ఓలు హాజరుకావాల్సి ఉండగా కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారని తెలిపారు. మండలంలోని మిగతా బూతుల్లో కూడా చాలామంది బిఎల్వోలు అందుబాటులో లేరు, అదేవిధంగా నూతన ఓటర్ల జాబితాలో లెక్కకు మించి తప్పులు ఉన్నాయన్నారు, ఒకచోట ఉండాల్సిన పేర్లు మరోచోట ఉండడమే గాక, కొందరి పేర్లు రెండు మూడు చోట్ల నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు, చాలామంది ఓటర్లు తమ పేరుఎక్కడ ఉందో తెలియక తికమకపడాల్సిన దుస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎలక్షన్ కమిషన్ వారి ఆదేశాలను పాటించి సంబంధిత మండల అధికారులు, బీఎల్‌ఓలు నూతన ఓటర్ల నమోదుతో పాటు జాబితా సవరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని పేర్కొన్నారు లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గోనుగుంట్ల రామాంజనేయులు గోశాల కృష్ణమూర్తి, మల్లెల నారాయణస్వామి, స్టూడియో అశోక్ వెంకటనారాయణ, రమణ, అనీఫ్, సిపిఐ నాయకులు చల్లా శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాసినేని ప్రభాకర్, గోనుగుంట సూర్యనారా యణ వర్గీయులు బాల భాస్కర్, నారాయణ స్వామి పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చారు.. స్థలాలు మరిచారు..

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం నాయకుల నిరసన

విశాలాంధ్ర-గోరంట్ల: పాలసముద్రం గ్రామానికి చెందిన 7 మందికి 1992లో అర్హులుగా గుర్తించి ఇంటి పట్టాలు ఇచ్చారని, పట్టాదారులకు స్థలాలు చూపాలని అదే విధంగా 20 వడ్డెర కుటుంబాల వారు 1992 నుండి ప్రభుత్వ భూమిని కాపాడుకుంటూ, తమ స్వాధీన అనుభవంలో ఉంచుకున్న స్థలాలకు పొజీషన్ సర్టిఫికెట్స్ ఇవ్వాలని గత 5 నెలల నుండీ కలెక్టర్‌తో మొదలుకొని తహశీల్దార్‌కు తెలిపిన ప్రయోజనం లేదని వాపోయారు, చివరికి గత వారం క్రితం పట్టాదారులు , అనుభవదారులు తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేయగా తహశీల్దార్ వారు శుక్రవారంలోపు మండల సర్వేయర్‌ను పంపి ప్లాట్లు గుర్తించి కేటాయిస్తామని, స్థలాల స్వాధీన అనుభవదారులలో అర్హులు అయిన పేదలకు పొజీషన్ సర్టిఫికెట్స్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ హామీ మేరకు మండల సర్వేయర్ వారు రాకపోవడంతో లబ్ధిదారులు తాసిల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని మండల సర్వేయర్‌ని పంపించాలని నిరసన వ్యక్తం చేశారు. తహసిల్దార్ మాట్లాడుతూ సర్వేయర్ అనా రోగ్యం వల్ల సెలవు పెట్టారని సోమవారం లేదా మంగళ వారం తప్పకుండా పంపించి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, పట్టాదారులు హబీబ్, రహమతుల్లా, రామకృష్ణమ్మ, నారా యణ, ఇండ్ల స్థలాల స్వాధీన అనుభవదారులు రామకృష్ణమ్మ, మంగమ్మ, శ్రీరాములు, లావణ్య, ఆనంద్, గంగరాజు పాల్గొన్నారు.

మొక్కలు లేకుండానే.. లెక్కలు నొక్కేశారు..

▸ పేరుకే ప్రజావేదిక.. భారీగా గోల్‌మాల్..

విశాలాంధ్ర-చిలమత్తూరు: ప్రతి ఏడాది సామాజిక తనిఖీ అనంతరం నిర్వహించే సామాజిక తనిఖీ ప్రజావేదికను అదికారులు మమ అనిపించారు. ప్రజావేదికను ప్రజలతో నిర్వహించల్సిన అధికారులు కేవలం ఫీల్డ్ అసిస్టెంట్ లు,టెక్నికల్ అసిస్టెంట్ లు,సచీవాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో నామమాత్రంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 12:40 కి ముగించేశారు. కనీసం ముందస్తు పత్రికా ప్రకటన ఇవ్వకుండానే హటాత్తుగా శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదికను స్థానిక ఎండీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. దీంతో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించి నట్లు ప్రజలకు తెలియరాలేదు. ప్రతి శనివారం చిలమ త్తూరులో వారపు సంత జరుగుతుంది అలా వచ్చిన ప్రజలతో పై అదికారుల కళ్లుగప్పి మామ అనిపిద్దామ నుకున్నారు తుఫాన్ కారణంగా వాతావరణం ప్రతికూ లించడంతో ప్రజలు పెద్దగా మార్కెట్‌కు రాకపోవడం తో ప్రజావేదిక నామమాత్రంగానే ముగిసింది..

మొక్కలు లేకుండానే లెక్కలు నొక్కశారు..

మండల పరిధిలో పలు పంచాయతీలో ప్రభుత్వం ఎన్ ఆర్జీఎస్ ద్వార పండ్ల తోటలు పెంపకం కోసం తీసుకొచ్చిన పథకంలో అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీలో బట్టబయలు అయింది. సామాజిక తనిఖీ బృందం వారు తనిఖీ సమయంలో అక్కడ అసలు మొక్కలే లేవని రైతులు వేరే పంటలు సాగుచేసుకున్నారని స్పష్టం చేశారు.అయితే మూడేళ్ల పాటు బిల్లు చెల్లించారని చెప్పుకొచ్చారు. అయితే 2022-23 ఆర్థిక సంవత్సరం కు సంబందించిన తనిఖీ కావడంతో బిల్లులు చేసే సమయంలో మొక్కలు ఉన్నాయని తర్వత ఎండిపోయాయని ఫీల్డ్,టెక్నికల్ అసిస్టెంట్‌లు కవర్ చేసుకున్నారు. తనిఖీ ఏప్రేల్,మే నెలలో జరిగితే అనేక అవకతవకలు బయటకు వచ్చేవి కాని ఆలస్యం కావడం అవినీతికి కలిసొచ్చినట్లు తెలుస్తుంది. చాలా వరుకు ఫారం పండ్లు వర్షాలు ఎక్కువ రావాడంతో పూడిపోయినట్లు సమాదానం చెప్పుకొచ్చా రని తనిఖీ బృందం చెప్పుకొచ్చారు. ఇలా చూస్తే తనిఖీనే కాదు పనులు నామమాత్రంగానే జరిగినట్లు స్పష్టం అయింది. అలాగే కూలీలకు రోజుకూలీ రూ.272లు చెల్లించాల్సి ఉండగా ఎవరికీ పూర్తీ స్థాయిలో చెల్లించ లేదని సాక్ష్యాత్తూ పీడీ ఎం.జగదీష్ కుమార్ మండి పడ్డారు. చాల మందికి 100 రోజులు కూడా పూర్తీ చేయించలేదని అన్నారు. అలా పూర్తీచేసి ఉంటే ఉన్నతిలో వారి కుటుంబీకులకు ఉపాది శిక్షణ ఉపాది అందేదని అన్నారు. మొత్తం మండల వ్యాప్తంగా తనిఖీలలో బాగంగా 29657 రూ.. రికవరీ చేయాల్సిందిగా సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎం జగదీష్ కుమార్,విజలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎండీఓ నరేష్ క్రిష్ణ పాల్గొన్నారు.

కోర్టు సమస్యలు పరిష్కరించే దిశగా కృషి

ఉమ్మడి జిల్లా జడ్జి.. జి.శ్రీనివాస్

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం కోర్టులోని సమస్యలను తప్పకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఉమ్మడి జిల్లా జడ్జి- జి. శ్రీనివాస్ తెలిపారు. శనివారం ధర్మవరం కోర్టులో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి అధ్యక్షతన బార్ సమావేశ భవనంలో న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం న్యాయవాదులు కోర్టులో గల సమస్య లను జిల్లా జడ్జికి విన్నవించారు. బార్ అసోసియేషన్ వారు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు మాట్లా డుతూ గతంలో జడ్జిగా ఉన్న కృష్ణవేణి హయాంలో 33 కేసులకు సంబంధించిన కేసు కట్టలు జిల్లా కోర్టు వారు తీసుకెళ్లామని, అప్పటినుంచి ఇప్పటి వరకు న్యాయవాదులుగా తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని, కక్షిదారులకు కూడా చాలా ఇబ్బందిగా ఉందని వాటిని వెనువెంటనే ఇప్పించాలని కోరారు. ఇందుకు స్పందించిన జడ్జి మాట్లాడుతూ తప్పనిసరిగా ఆ కేసు కట్టలను ధర్మారం కోర్టుకు పంపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పిడిఎం, ఏడీఎం కోర్టులో పెండింగ్లో ఉన్న వాటికి న్యాయవాదులు తమ సహాయ సహకారాలు అందించి కేసులు సత్వరమే పరిష్కరించే విధంగా చేయాలని తెలిపారు. అదేవిధంగా ఈనెల 9వ తేదీన జాతీయ మెగా లోక్ అదాలత్ విజయవంతం చేయుటలో న్యాయవాదులు, పోలీసులు తమ సాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలని వారు కోరారు. కోర్టు ఆవరణలో ప్రస్తుతం ఉన్న జిరాక్స్, టీ బంకులను వెంటనే ఆ స్థలం నుండి వారంలోపు వేరే చోటికి మార్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి. గీతా వాణి, జూనియర్ సివిల్ జడ్జ్ రమ్యశ్రీ, కోశాధికారి బిళ్ళే రవీంద్ర సీనియర్, జూనియర్ న్యాయ వాదులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ రోటివేటర్ కింద పడి డ్రైవర్ మృతి

విశాలాంధ్ర-పెనుకొండ: ఆడదాకులపల్లి గ్రామం లో శనివారం పొలం దున్నడానికి పొలంలోకి ట్రాక్టర్ వేసుకొని వెళ్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ అంజనేయులు(36) రోటివేటర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కావేరి పిల్లలు ఋషి, హారిక ఇద్దరు ఉన్నారు. మృతుడు మరణ వార్త విని భార్య తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సవిత ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఐదు రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలుపునకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-ధర్మవరం: ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అఖండ మెజారిటీతో గెలవాలని కోరుతూ పట్టణంలోని చెరువు కట్ట వద్ద గల దర్గాలో ముస్లిం సోదరులు మైనారిటీ నాయకులు ప్రత్యేక పూజలను, ప్రార్థనలు చేశారని ఇన్‌ఛార్జి రంగనాథ నారాయణ తెలిపారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే కర్ణాటకలో కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని, అదేవిధంగా తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశాలు సర్వేలలో తేలిందన్నారు. 5 రాష్ట్రాలతో పాటు ఏపీలో కూడా తప్పనిసరిగా కాంగ్రెస్ మంచి మెజారిటీతో గెలవడం జరుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కరీం, తాహిర్, ముస్తఫా, జాఫర్, ఫరూక్ భాషా పాల్గొన్నారు.

ఓటర్ జాబితాపై అధికారులు పారదర్శకతగా వ్యవహరించాలి

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అనుచరులు

విశాలాంధ్ర-ధర్మవరం: ముసాయిదా ఓటరు జాబితాపై అధికారులు పారదర్శకతకంగా వ్యవహరించాలని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అనుచరులు చికిచెర్ల అరవింద్‌రెడ్డి, డిష్ రాజు, తుంపర్తి పరమేష్ తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి మాటలు వింటే అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో నివసించే వారికే ఓటు హక్కు ఉండాలని, దొంగ ఓట్లు ఉండరాదని తెలిపారు. అర్హత గల వారికే ఓటు హక్కు ఉండే విధంగా బిఎల్వోలు అధికారులు పారదర్శకతో తమ విధులను నిర్వర్తించాలని తెలిపారు. ఫారం-7 దరఖాస్తులను ఓటరుకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం దారుణం అన్నారు. ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఎన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లో నీ పార్టీ అడ్రస్ లేకుండా పోతుందని తెలిపారు. ఎన్నికల నిబంధనను తుంగలో తొక్కి అధికార పార్టీ నాయకులు ప్రతిపక్ష పార్టీల సానుభూతి పనుల ఓట్లను టార్గెట్ చేయడం సరికాదని హితవు పలికారు. కార్యక్రమంలో గోనుగుంట అనుచరులు దుస్సాకృష్ణ, సరితాల దస్తగిరి, బోడగల గిరిధర్, నబి రసూల్, చిలకం సూర్యనారాయణ రెడ్డి, రాప్తాటి రాము, ఏలుకుంట్ల లక్ష్మీనారాయణ, చెన్నారెడ్డి, మార్కెట్ రహీం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన పనులను ఆపండి..

విశాలాంధ్ర-ధర్మవరం: కదిరి గేటు వద్ద నిర్మించదలచిన రైల్వే ఉపరివంతన కోసం హైకోర్టు స్టే ఇచ్చిందని అయినా కూడా కోర్టు కోర్టును దిక్కరించి పనులు చేయడం సమంజసం కాదని కోరుతూ శనివారం ఆర్‌డీఓ రమేష్‌రెడ్డికి వినతిపత్రాన్ని బాధితులు అందజేశారు. బాధితులు లక్ష్మీనారాయణ, మనోహర్, నాగరాజు, అంజనేయులు, ఆదినారాయణ, నాగార్జున, మల్లికార్జున మాట్లాడుతూ ఏళ్ల తరబడి కదిరి గేటు పరిసర ప్రాంతాల్లో తాము నివసిస్తున్నామని, మా జీవనాధారం కూడా దెబ్బతింటుందని, ఈ ప్రక్రియలో అనేక అభ్యంతరాలు ఉండటం వలన తాము హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు స్టే విధించడం జరిగిందని తెలుపుతూ స్టే ఆర్డర్‌ను కూడా ఆర్డీవోకు ఇచ్చారు. కేసు కోర్టులో తుది తీర్పు వచ్చిన తర్వాత ఎటువంటి ప్రక్రియ అయినా చేపట్టవచ్చునని హామీ ఇచ్చారు.

ముగిసిన ధర్మవరం ఉరిసే షరీఫ్

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని చెరువు కట్ట వద్ద గల ఖాద్రి రోజా ఏ ముబారక్ హజరత్ సయ్యద్ మహమ్మద్ షా ఖాదర్ వలీ 97వ ఉరిసే షరీఫ్ వేడుకలు అత్యంత వైభవంగా ఈనెల 29 నుండి డిసెంబర్ రెండవ తేదీ వరకు నిర్వహిస్తున్నామని గౌరవ అధ్యక్షులు సోలిగాల్ల వెంకటేశులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 29న గంధంతో ఈ వేడుకలు ప్రారంభం కావడం, 30వ తేదీన భయాన్ (ఉపన్యాసము) జరిగిందని, అనంతరం డిసెంబర్ 1వ తేదీన స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు హైదరాబాద్ టీవీ సింగర్ షాఫ్ య వార్సి, చాంద్ అతిన్ గొప్ప కవాలి ప్రోగ్రాం అందరినీ ఆకట్టుకుందని తెలిపారు. చివరి రోజు శనివారం కూడా టీవీ సింగర్ సాధిక సంజరి, చాంద్ అతీష్‌లు ఖవ్వాలి ప్రోగ్రాం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారి ఉరుసు కార్యక్రమానికి భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని చదివింపులు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు కాజా హుస్సేన్, ఉపాధ్యక్షులు మహబూబ్ అలీ, ప్రధాన కార్యదర్శి హైదర్ వలీ, సహకారదర్శి బాబా ఫక్రుద్దీన్, కోశాధికారి ముక్తియార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి పండుగను వైభవంగా నిర్వహిస్తాం..

విశాలాంధ్ర-ధర్మవరం: వైకుంఠ ఏకాదశి పండుగ వేడుకలను ఈనెల 23న పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో అత్యంత వైభవంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం ఆలయ ఈవో వెంకటేసులు తెలిపారు. శనివారం సాయంత్రం పాలకవర్గంతో వారు సమావేశాన్ని నిర్వహించారు. 23వ తేదీ తెల్లవారుజామున 2 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు నిరవధికంగా భక్తాదులకు దైవ దర్శనాన్ని కల్పిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఈ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రామ శాస్త్రి, పోరాల పుల్లయ్య అర్చకులు భాను ప్రకాష్ కోనేరా చార్యులు మకరంద బాబు, పాలకవర్గం సభ్యులు బండ్లపల్లి రంగనాథ్, జగ్గాబరిని, అజంతా కృష్ణ, అంబటి శ్రీధర్, సత్రశాల నారాయణ, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

బీఎల్‌వోలు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి..

ఆర్డీవో రమేష్ రెడ్డి

సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్‌డీఓ రమేష్‌రెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: ఓటు హక్కు అర్హత గల ప్రతి ఒక్కరికీ కల్పించే విధంగా బిఎల్‌ఓలు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ఆర్డీవో రమేష్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఫారం-6,7,8 దరఖాస్తులను భర్తీ చేసే విషయంలో తప్పనిసరిగా నిర్లక్ష్యం అశ్రద్ధ ఉండకుండా ఖచ్చితమైన సమాచారాన్ని పొందుపరచాలని ఆదేశించారు. ఎక్కడ కూడా రాజకీయ ఒత్తిళ్లకు గురికాకూడదని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అందరూ కూడా తప్పనిసరిగా తమ విధులను బాధ్యతతో నిర్వర్తిస్తే ధర్మవరం పట్టణానికి ప్రజల ద్వారా మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. బీఎల్వోలు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటే ఆయుధం : ఎంఈఓ భాస్కర్

విశాలాంధ్ర-అగళి : ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని తహసీల్దార్ జమానుల్లా ఖాన్ ఎంఇఓ భాస్కర్ తెలిపారు. గుప్తా కళాశాలలో శనివారం నూతనంగా ఓటు హక్కు నమోదుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటే ప్రధాన ఆయుధమని, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకొని మంచి నాయకున్ని ఎన్నుకోవాలన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పంటించిన దుండగులు

విశాలాంధ్ర-గోరంట్ల: పట్టణంలోని రావికుంట వద్ద కాపురం ఉంటున్న బేల్దారు రవికి చెందిన ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. ఇంటి ఎదుట నిలిపి ఉన్న ద్విచక్ర వాహనానికి అర్ధరాత్రిలో పాత సంచులు వేసి నిప్పు అందించడంతో కాలిపోయింది.. పక్కనే ఉన్న ఇంటి తలుపులు కూడా కాలి పోయాయి. సమీపంలో సిలిండర్ ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరగకపోవ దంతో పెనుప్రమాదం తప్పింది. బాధితుడు పోలీసులకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చంద్రబాబును కలిసిన మాజీ మంత్రి పల్లె

విశాలాంధ్ర-పుట్టపర్తి: మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధినేత చంద్రబాబును మాజీ మంత్రి పుట్టపర్తి నియోజకవర్గ ఇంచార్జి పల్లె రఘునాథ్ రెడ్డి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. శనివారం విజయవాడలోని చంద్రబాబు నివాసంలో పల్లె కలిసి నియోజకవర్గంలోని స్థితిగతులను వివరించారు. ఈ మేరకు అక్కడ నుంచి పల్లె ఫోన్‌లో మాట్లాడుతూ, కష్టకాలంలో నియోజకవర్గ ప్రజలు టిడిపి నాయకులు కార్యకర్తలు పార్టీకి అండగా నిలబడ్డారని ప్రశంసించారన్నారు. వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులతో జైలుకు పంపించిన తీరుతో ప్రజలలోనే కాకుండా కార్యకర్తలలో నెలకొన్న ఆందోళనలు మీరు వారిలో నింపిన ఆత్మ ధైర్యం కూడా నేనెప్పటికీ మర్చిపోలేదని చంద్రబాబు చెప్పారన్నారు. వైసిపి ప్రభుత్వంపై పెద్దఎత్తున ఆందోళనలు కార్యక్రమాలు నిర్వహించాలని గుర్తు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొని ప్రజలలో మరింత మమేకమయ్యారని ప్రశంసించారన్నారు. వైసీపీ అరాచకాలను ప్రజలు సమర గీతం పాడడానికి రోజులు దగ్గరలోనే ఉన్నాయని అధినేత చెప్పారు అన్నారు. నియోజకవర్గం టిడిపికి ఎంతో బలంగా ఉందని మీరు పార్టీకి ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో బాగున్నాయని అభినందించారన్నారు. వచ్చే ఎన్నికలలో టిడిపి జెండా రెపరెప లాడాలని నాయకులను కార్యకర్తలను సంసిద్ధం చేయాలని చంద్రబాబు చూపించారన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం అవుతాయి

- సెబ్ సిఐ భార్గవ్ రెడ్డి

విశాలాంధ్ర- మడకశిర: మాదకద్రవ్యాల వల్ల జీవి తాలు నాశనం అవుతాయని సెబ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలియ జేసారు. శనివారం పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో మాదకద్రవ్యాల అవగాహన సదస్సు నిర్వ హించారు. సెబ్ సిఐ భార్గవరెడ్డి మాట్లాడుతూ ఇంట్లో పిల్లలు ప్రవర్తించే తీరును ప్రతిఒక్క తల్లిదండ్రీ గమనిస్తూనే ఉండాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. యుక్త వయసులో అనేక అలవాట్లకు ఆకర్షితులై మాదక ద్రవ్యాల వైపు మొగ్గుచూపి వారి జీవితాలను నాశనం చేసుకుంటారని ఇలాంటి సమయం లో వారిపై తల్లిండ్రులు నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్‌ను ఉపయోగించడం వల్ల ప్రతి ఒక్కరి ఆరోగ్యం దెబ్బతిని కాలేయం గుండె సంబంధిత రోగాల బారిన పడతారని , కాబట్టి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు.

వాల్మీకి ఆలయ ప్రతిష్ఠకు విరాళం

విశాలాంధ్ర - హిందూపురం : పట్టణంలో దాతల సహాయ సహకారాలతో నూతనంగా నిర్మించిన మహర్షి వాల్మీకి దేవాలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి, ఏపీ ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ బి నవీన్ నిశ్చల్ విరాళమిచ్చారు. త్వరలో ప్రతిష్ట గావించే మహర్షి వాల్మీకి దేవాలయ అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందించాలని, దేవాలయ కమిటీ సభ్యులు నవీన్ నిశ్చల్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన రూ.2 లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు. దేవాలయ అభివృద్ధి కోసం సహాయక సహకారాలు అందించిన నవీన్ నిచ్చల్ కు, ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి దేవాలయ కమిటీ సభ్యులు రామకృష్ణప్ప, బి ఎస్ మూర్తి, సాయి, దేవరాజ్, విజయకుమార్, కొండప్ప, హనుమంతప్ప, చెన్నప్ప, కాలువ రమణ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు ఎన్ఆర్ఐ శేషానంద రెడ్డి రూ.100116 విరాళం

విశాలాంధ్ర-గోరంట్ల: మండలంలోని బూడిదగడ్డ పల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు జయ చంద్రారెడ్డి తనయుడు ఎన్ఆర్ఐ శేషానంద రెడ్డి పట్టణంలోని దామ రోడ్డు లో గల శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ సభ్యులకు రూ.100116/-లను తల్లి ఓబులమ్మ చేతుల మీదుగా అందజేశారు. శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమానికి విరాళం అందజేసినట్లు ప్రకటించారు, ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ప్రధాన పురోహితులు తారనాథ్ శర్మ, గురు స్వామి రుషింద్ర, సభ్యులు రాజశేఖర్ రెడ్డి బాల రంగయ్య వెంకటరెడ్డి నార్సింపల్లి సర్పంచ్ లక్ష్మీ గంగాధర అయ్యప్ప మాలదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా

సాంఘిక దురాచారాలు మానవతా సంస్థ సేవలను ఆపలేవు..

విశాలాంధ్ర-ధర్మవరం: సాంఘిక దురాచారాలు మానవతా సంస్థ సేవలను ఆపలేవని ఆ సంస్థ అధ్యక్షులు తల్లం నారాయణమూర్తి కార్యదర్శి చిన్నప్ప పేర్కొన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని గన్నే అశ్వర్తప్ప(70) మృతి చెందారు. మృతునికి భార్యతో భార్యతో పాటు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరందరూ కూడా మంచి ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తున్నారు.మృతి చెందిన వారు నామదారులు తెగకు చెందిన వారు అని, పెద్ద బందు వర్గం ఉన్నా కూడా వారందరూ మోడీకాళ్ల తెగకు చెందిన వారిని అందుకే అంతక్రియలో పాలుపంచుకోలేదని తెలిపారు. సమాచారం అందిన వెంటనే మానవతా విలువలను పెంచేందుకు మా సంస్థ సభ్యులు అక్కడికి వెళ్లి సాంప్రదాయ పద్ధతిలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు భాస్కర్ అలియాజ్ శివ అంతక్రియలు కూడా నిర్వహించడం జరిగిందని తెలిపారు. మానవతా సంస్థ చేస్తున్న ఈ సేవల పట్ల ప్రజలు వారిని అభినందించారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 3, డిసెంబర్ 2023

కరెంటుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ శాఖ ఏఈ విజయ్‌కుమార్

విశాలాంధ్ర-శింగనమల: మండల వ్యాప్తంగా మీ చాంగ్ తుఫాన్ వల్ల వర్షాలు పడుతున్నందువల్ల విద్యుత్ వినియోగదారులకు మరియు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శింగనమల మండల విద్యుత్ ఏఈ విజయ్ కుమార్ తెలియ చేశారు. మీ చాంగ్ తుఫాన్ వలన వర్షాలు ఈదురుగాలుల వల్ల రైతులకు సంబంధించిన కరెంట్ మోటార్లు మునిగి స్టార్టర్స్, డబ్బాలు తడిసి ఉండటంవల్ల సర్వీసెస్ వైర్స్ డామేజెస్, అవుతాయి. స్తంబాలు పడిపోవచ్చు, వైర్స్ తెగిపోవచ్చు,కావున వాటిని ముట్టుకొనే ప్రయత్నం కానీ, దగ్గరకు వెళ్లే ప్రయత్నం కానీ చేయరాదని, మరియు ఆక్వా రైతులు, ఏరియేటర్స్ ను ముట్టుకోరాదని, అటువంటి సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని,అలాగే మీ ఇంటికి సంబంధించిన సర్వీస్ వైర్లని కాని, వాటితో వెలాడే ఇనుప తీగలను కానీ, కరెంట్ స్తంభాలను కానీ, ఇనుప స్తంభాలను కానీ, లైన్స్ మీద చెట్టుకొమ్మలు పడినా కానీ, ముట్టుకొనే ప్రయత్నం చేయరాదని, ఇంట్లో నుండి బయటకు వచ్చేటప్పుడు, వాహనాలలో వెళ్ళేటప్పుడు జాగ్రత్తలు పాటిం చాలని తడిచేతులతో ఇంట్లోని స్విచ్ బోర్డులను ముట్టుకోరాదని, అటువంటి సమయాలలో విద్యుత్ షాక్ తో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, విద్యుత్ షాక్‌తో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త గా ఉండాలని, ఏదైనా విద్యుత్ సమస్య వుంటే,తీగలు తెగినా, పోల్స్ పడిపోయిన వెంటనే మీ లోకల్, లైన్ ఇన్‌స్పె క్టర్‌కు కానీ లైన్‌మెన్‌కు కానీ, సబ్ స్టేషన్స్‌కు కానీ, ఏఈ దృష్టికి కానీ, 1912కు కానీ తెలియజేయాలని విద్యుత్‌శాఖ ఏఈ

తలసేమియా చిన్నారికి అరుదైన బీ నెగిటివ్ రక్తదానం

విశాలాంధ్ర-ఉరవకొండ : గుంటకల్లు పట్టణానికి చెందిన తలసేమియా చిన్నారికి బి నెగిటివ్ రక్తం ఎక్కించాలని ప్రయివేటు హాస్పిటల్ వైద్యులు కుటుంబ సభ్యులకు సూచించడంతో కుటుంబ సభ్యులు బి నెగిటివ్ రక్తం కోసం ఉరవకొండకి చెందిన అపద్బాంధవ స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించారు. ట్రస్ట్ నిర్వాహకులు కూడా వెంటనే స్పందించి ఉరవకొండకు చెందిన కృష్ణామూర్తి అరుదైన బీ నెగిటివ్ రక్తదాత ఉన్నాదని తెలుసుకుని సంస్థ కృష్ణమూర్తికి వెంటనే సమాచారం అందించడంతో ఆయన కూడా వెంటనే ఆసుపత్రికి చేరుకుని రక్తం దానం చేశారు. బి నెగిటివ్ రక్తం కలిగిన కృష్ణమూర్తి ఇప్పటివరకు 37 సార్లు రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నారు.ఇందుకు బాధిత కుటుంబ సభ్యులందరూ కృష్ణా మూర్తికి ఆపద్బాంధవ ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నిరంతర సాధనతో ప్రభుత్వ కొలువులు సాధ్యం

ఉపకులపతి ఆచార్య జింక రంగ జనార్ధన్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్

విశాలాంధ్ర-జెఎన్‌టీయూఏ: నిరంతర సాధనతో ప్రభుత్వ కొలువలు సాధ్యం అని ఉప కులపతి ఆచార్య జింక రంగ జనార్ధన్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ పేర్కొన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ రీజినల్ ఎంప్లాయి మెంట్ శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రణా ళిక కార్యాచరణ, పుస్తకాల అన్వేషణ, సమకాలీన అంశాలు, జాతీయ, అంతర్జాతీయ వాస్తవిక విషయాలపై పట్టు, పరీక్షపై సన్నద్ధతను సాధించాలని అన్నారు.

రెక్టర్ ఆచార్య విజయకుమార్ మాట్లాడుతూ.. నియామకాలకు అర్హత ప్రమాణాలను పెంపొందించుకుని, పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగాన్ని కైవసం చేసుకునేందుకు నిరంతర కృషి ఉండాలన్నారు. రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగం సాధిం చలేమనే ఆలోచన మానుకోవాలని.. లక్ష్యాన్ని నిర్దేశించుకుని సివిల్ సర్వీస్ పరీక్షకు సన్నద్ధలు కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ అరుణ క్రాంతి, సుజాత, శ్రీనివాసులు, అనంతపురం జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కళ్యాణి, మాజీ ఆచార్యులు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను నిలువునా ముంచుతున్న వరి కోత యంత్ర యజమానులు

విశాలాంధ్ర-కొత్తచెరువు :

రాత్రింబవళ్లు కష్టపడి రైతులు పంట పండిస్తే పంట చేతికి వచ్చే టైం లో వరి కోత యంత్ర యజమానులు రైతుల కడుపులు కొడుతున్నారు. ఇప్పటికే కూలీలు దొరకక నానా ఇబ్బందులు పడుతున్న రైతులకు యంత్రాల రాకతో కొంచెం ఆనందపడ్డారు. కూలీలతో పని లేకుండా యంత్రాల సహాయంతో తక్కువ ఖర్చుతో పంటలను వేయవచ్చు అనుకున్నారు. కానీ ఇదే అదునుగా చూసుకున్న వరి కోత యంత్ర యజమానులు రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. సాధారణంగా 2000 రూపాయలు వసూలు చేస్తున్న యజమానులు ఇప్పుడు వర్షం పేరు చెప్పి 3500 నుంచి 4 వేల వరకు వసూలు చేయడం ప్రారంభించారు. ఇంతే కాకుండా ఒక గంట సమయం పట్టవలసిన దగ్గర రెండు గంటల సమయం చేస్తున్నారు. అంటే రైతుపై పెనుభారం మోపుతున్నారు. గత్యంతరం లేక వచ్చిన కాటికి రానిలే అన్నట్టు రైతులు వరి కోత యంత్ర యజమానులు చెప్పిన కాటకి తల ఊపోవాల్సి వస్తుంది. గుడ్డి కన్నా మెల్ల మేలు అన్నట్టుగా తుపాను వల్ల పంట నష్టం పోయే కంటే ఎంతో కొంత రానిదే అన్నచందంగా రైతులు సర్దుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు కానీ, ఉన్నతాధికారులు కానీ వీటిపై స్పందించి తగు చర్యలు తీసుకోకపోతే వరి కోత యంత్ర యజమానుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఈ యంత్రాల యజమానులపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు.

రేపు రాప్తాడులో బస్సు యాత్రను జయప్రదం చేయండి..

-ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

విశాలాంధ్ర-రాప్తాడు: మండల కేంద్రంలో ఈనెల 4వ తేదీన జరగనున్న వైసీపీ సామా జిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శని వారం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయన విలేకరుల తో మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గంలో మండలస్థాయి పదవులు 80 శాతం, ఎంపిటిసి, సర్పంచ్‌లు, వార్డ్‌మెం బర్లు 70 శాతానికి పైగా కేటాయించామన్నారు. 40 ఏళ్లుగా బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీలను మోసం చేసిన టీడీపీ అగ్రవర్ణ పెత్తందారి విధానా లను అమలు చేసేందుకు ఆయా వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుందన్నారు. తమకు ఓట్లు వేయని వారికి, ఓడించిన వారికి లబ్ధి జరగకూడదనే పరిటాల సునీత అజెండాగా పెట్టుకుందని విమర్శించారు. బిసిలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు బ్యాక్‌బోన్ క్లాస్‌గా సీఎం జగన్ నిరూ పించారన్నారు. నియోజకవర్గంలో 50 వేల ఓట్ల తొలగింపు నకు పరిటాల సునిత కుట్ర పన్నిందన్నారు. మంత్రిగా ఉన్న సమయం లో దొంగ ఓట్లు ఎక్కిస్తే ఆమె నిద్రపోతోందా అన్నారు.

సైడ్ వాల్ ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర-పామిడి: కల్వర్టు పై వెళ్లేటప్పుడు రహ దారులు ఏమాత్రం ఆదమరిస్తే మృత్యు వాత పడాల్సిందే. పామిడి మండల కేం ద్రంలోని కొండాపురం రోడ్డు కాలవ ఏర్పాటు చేసిన కల్వర్టుకు ఇరువైపులా ఉన్న సైడ్ వాళ్లు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ఈ కల్వర్టుపై ప్రయాణించాలంటే వాహన శోధకులు బెంబేలెత్తుతున్నారు. గతంలో పల్లెనిద్ర కార్యక్రమం ఏపీకి జగన్ ఎందుకు కావాలి కార్య క్రమం చేశారు. నాయకులంతా ఈ రోడ్డు గుండా ప్రయాణించారు. వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన కల్వర్టుపై వెళ్తూ ప్రమాదవశాత్తు కాలువలో పడి గాయాలపాలయ్యారు. కస్తూర్బా బాలికల పాఠశాల,ఉన్నత పాఠశా, ఆదర్శ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాలకు, సచి వాలయాలకు వెళ్లాలంటే ఈ కల్వర్టు మీదుగా వెళ్లాంటే భయపడు తున్నారు. సైడ్‌వాల్ లేకపోవడంతో గతంలో కాలువలోకి ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు పడిపోయి ఆస్తి నష్టం జరిగింది.. కానీ ప్రాణ నష్టం జరగలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలుదపై ఏర్పాటు చేసిన కల్వర్టుకు ఇరువైపులా సైడ్‌వాల్ ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

ఓటర్ ధ్రువీకరణను త్వరితగతిన పూర్తి చేయాలి..

తెదేపా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ

విశాలాంధ్ర-గుడిబండ: మండల కేం ద్రంలోని బూత్ నంబర్ 70,71లో బీఎల్ఓలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ ధ్రువీకరణలను ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ చేర్పులు మార్పులు డబ్బులు ఎంట్రీ డెత్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్,యూనిట్ ఇంచార్జి జనార్ధన్, బూత్ ఇన్చార్జ్ లు నాగరాజు,అజ్జర్ తెదేపా నాయ కులు నాగేంద్ర,నాగలింగప్ప, గౌస్ పీర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీరామప్ప, బీఎల్‌వోలు దేవీబాయి, సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ ఎంపీపీకి సన్మానం..

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండల ప్రజా పరిషత్ నూతన అధ్యక్షులుగా ఎన్ని కైన వెలిగొండ నరసిం హులును శనివారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బంగారు షాప్ నిర్వాహకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆయనకు శుభాకాం క్షలు తెలిపారు. నూతన అధ్యక్షులు మండలాన్ని అభి వృద్ధి పథంలో నడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్వర్ణ మహల్ బంగారు షాప్ నిర్వాహకులు సోమశేఖర్, మేటి బసవరాజు, విరు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించండి : ఎంపీపీ

విశాలాంధ్ర-ఉరవకొండ: ప్రభుత్వ అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలని విడపనకల్లు ఎంపీపీ కరుణ పుష్పావతి భీమిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కరణం పుష్పవతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు హనుమంతు, వైస్ ఎంపీపీ రాకెట్ల పుష్పావతి, భీమ్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తాగునీరు, విద్యుత్తు, పారిశుద్ధ్యం, గృహ నిర్మాణం వ్యవసాయం, విద్య, ఉపాధి హామీ తదితర అనేక శాఖలకు సంబంధించిన సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీపీ కరణం పుష్పావతి మాట్లాడుతూ గౌరవ సభ్యులు అడిగిన అన్ని సమస్యలను సంబంధిత శాఖ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. కొంతమంది అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అది మంచి పద్ధతి కాదన్నారు. పారదర్శకం గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవో ఆర్డీవో సత్యబాబు, ఎంపీటీసీ సర్పంచులు, ప్రభుత్వ శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వనభోజన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి..

రాయలసీమ బలిజ మహా సంఘం నాయకులు పిలుపు

విశాలాంధ్ర-బత్తలపల్లి: కార్తీక మాస బలిజ వనభోజన మహో త్సవాన్ని జయప్రదం చేయాలని రాయలసీమ బలిజ సంఘం నాయ కులు పిలుపునిచ్చారు. ఈనెల 3వ తేదీన అనంతపురం సమీపంలోని తడకలేరు అశ్వర్థ నారాయణస్వామి వనములో రాయలసీమ బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని బత్తలపల్లి, తాడమర్రి, ముదిగుబ్బ మండలాలలో ఉన్న బలిజ కులస్తులం దరూ పాల్గొనాలని కోరారు. గత రెండ్రోజుల నుంచి ఇంటికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందించి కార్యక్రమానికి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ప్రతి బలిజ కులస్తులు కూడా కుటుంబ సమేతంగా కార్యక్రమానికి రావాలని కోరారు. ఈ కార్యక్ర మంలో జ్వాలాపురం ఎంపీటీసీ బొడ్డు నాగేంద్ర, బొడ్డు సురేష్, కావేటి మల్లికార్జున, రవి, నరేంద్ర పాల్గొన్నారు.

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: శు క్రవారం జరిగిన ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూని యన్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ సుబ్బా రాయుడు ఆధ్వర్యంలో నూతన జిల్లా కమిటీని ఎన్ను కున్నారు. గౌరవాధ్య క్షులు జె.రాజారెడ్డి,జిల్లా అధ్యక్షులు జి.చిరంజీవి, కార్య నిర్వహ అధ్యక్షులు నరసయ్య,ఉపాధ్యక్షులు కొండయ్య, ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్, కార్యదర్శులు నాగరాజు,రఫీ, కోశాధికారి వేణుగోపాల్ వీరితో పాటు 25 మందిని జిల్లా సమితి సభ్యులుగా ఎన్నుకున్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం ..

విశాలాంధ్ర-పామిడి: గుంతకల్లులో ఈ నెల 9వ తేదీ జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గుంతకల్లు నియోజకవర్గంలో జరిగే సామాజిక బస్సుయాత్ర స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఏపిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీర పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. నియోజకవర్గ సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు.

న్యాయం చేయండి...

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద శనివారం తమకు న్యాయం చేయాలని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన నాగేంద్రమ్మ, నాగరత్నమ్మ నిరసన తెలిపి తాహసిల్దార్‌కు విన తిపత్రం అందజేశారు. మండలంలోని భోగసముద్రం పంచాయతిలోని అయ్యవారిపల్లి గ్రామ నివాసులమైన తాము మూడు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన ముత్యాల రెడ్డితో స్థలం కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నాము. ఈ స్థలంలో ఇండ్లు నిర్మించు కోవడానికి ప్రయత్నిస్తుం డగా గంగాదేవి అనే ఆమె ఈ స్థలం నాదని అడ్డుపడుతున్నది. ఈ భూ సమస్యపై అనేకసార్లు పోలీస్ స్టేషన్, ఎమ్మార్వో ఆఫీస్‌లోని అధికారులకు అర్జీ రూపంలో విన్నవించుకున్నా అధికారులు స్పందించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గంగాదేవి అనే ఆమెకి బోగ సముద్రం సచి వాలయ సెక్రెటరీ తాము రిజిస్టర్ చేసుకున్న స్థలాన్ని వన్ టైం సెటిల్మెంట్ కింద జగనన్న పట్టా పంపిణీ చేశారు. న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ..

విశాలాంధ్ర-పెనుగొండ: మండలం లోని చిన్నపరెడ్డిపల్లి గ్రామం నందు శనివారం శ్రీ గణ పతి శ్రీ సీతారామ లక్ష్మణ సమేత అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం, శు క్రవారం, శనివారం వేద పండితులు యజ్ఞాలు, పూజ లు నిరాటంకంగా కొనసాగించి ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శంకర్ నారాయణ, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, సవిత, వైసీపీ నాయకురాలు ఉమారాణి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, పెనుకొండ ఎంపీపీ గీత రామ్మోహన్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయపెద్దలుగా వ్యవహరించిన వారు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది నాగరాజు, ప్రసాద్‌రెడ్డి, నాగ భూషణ, రాము, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య ..

విశాలాంధ్ర-యాడికి: మండలం లోని కుర్మాజీపేట గ్రామంలో మన స్థాపంతో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు. కుర్మాజిపేట గ్రామానికి చెందిన విజయ్‌కు ఏడు నెలల క్రితం పూజిత వివాహం అయిందని.. తన భార్య మూడు నెలల గర్భవతి అని తన పుట్టినిల్లు అయిన గజరాంపల్లి గ్రామా నికి వెళ్లి అక్కడ నుంచి వేరు కాపురం పెట్టాలని తన భర్త అయిన విజయ్ ఒత్తిడి చేస్తుండగా విజయ్ అటు తల్లిదం డ్రులకు ఇటు భార్యకి చెప్పుకోలేక మనస్థాపం చెంది శుక్రవారం రాత్రి ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం తల్లిదండ్రులు చూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు తండ్రి గంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎసై గురు ప్రసాద్ రెడ్డి తెలిపారు.

దొంగ ఓట్లను తొలగించండి..

విశాలాంధ్ర-రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి గ్రామంలోని ఓటరు జాబితాలో ఉన్న దొంగ ఓట్లను తొలగించాలని టిడిపి సీనియర్ నాయకుడు ధనుంజయ నాయుడు కోరారు. ఈమేరకు శనివారం ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జున కు వినతిపత్రం అందజేశారు. ప్రసన్నాయపల్లి పంచాయతీలో బూత్ నంబర్ 127 నుండి 134 వ బూతు వరకు ఉన్న ఓటరు జాబితాలో ఇటీవల ఆధారాలు లేక కేవలం విద్యుత్ బిల్లులతో ఓటరు నమోదు చేశారని వాటిని పరిశీలించి రద్దు చేయా లన్నారు. ఈ పంచాయతీలో ఏ పార్టీకి సంబంధించిన వారైనా పూర్తి ఆధా రాలతో ఓటర్ నమోదు చేయించుకోవాలని లేని పక్షంలో వారి ఓటును ఓటరుగా జాబితాలో నమోదు చేయవద్దన్నారు. ఇక్కడికి దూర ప్రాంతాల నుంచి వలస వచ్చి వారు కూడా ఓటు నమోదు చేయించుకుంటున్నారని అలాంటి వారికి ఒకచోట మాత్రమే ఓటు ఉండేలా ఆధార్ కార్డును రేషన్ కార్డును పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఓటరు లిస్టులో ఎలాంటి అవకతవకులు లేకుండా పారదర్శకంగా తయారు చేయాలని కోరారు.

ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనం చెత్త పేరుకుపోవడం

విశాలాంధ్ర-పెనుకొండ: పట్టణ కేంద్రంలో అన్ని వార్డు ల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండి పోయిందని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి విడుదల రజని చూస్తే గొప్పలు, కానీ గ్రౌండ్ లో చూస్తే అందుకు పూర్తిగా వ్యతిరేకం అని ఇపుడు పెనుకొండ ప్రభుత్వ హాస్పిటల్ చుట్టూ ఉన్నా చెత్త ,చెదారం చూస్తే అర్థం అవుతుందనీ టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సవిత చెత్త పేరుకుపోయిన ప్రదేశాలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వంపై ఆమె మండిపడ్డారుకనీస నిర్వహణ లేకుండా ఈ వైస్సార్సీపీ ప్రభుత్వం పేదల జీవితాలతో ఆడుకొంటుందని , ఎమ్మెల్యే గుడ్‌మార్నింగ్ అంటూ అన్ని వార్డుల్లో గడప గడపకు తిరిగినప్పుడు ఈ చెత్తచెదారం కనిపించదా?మున్సిపల్ అధికా రులు స్పందించి పట్టణంలోని ఉన్న చెత్త చెదారాన్ని తీసివేసి పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన నాయకులు

విశాలాంధ్ర-యాడికి: యాడికి మండలం వేములపాడు బైపాస్ రోడ్డు మీదుగా గుంతకల్ వెళ్తున్న పర్యావరణ ఘనుల శాఖ మంత్రి వర్యులు, అనంతపురం జిల్లా ఇంచార్జ్ శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్యను మార్గమధ్యలో మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ శనివారం మర్యాదపూర్వకంగా కలి శారు. ఎంపీటీసీ సభ్యులు వెంకటనాయుడు, అవుకు నాగరాజు, గొడ్డు మర్రి రామమోహన్ వార్డుసభ్యులు గుంత తిరుపతి, గజ్జి బాలపెద్దయ్య, మేకల రామచంద్ర మరియు ఎస్సీ సెల్ కన్వీనర్ పందు శ్రీరాములు, సోషల్ మీడియా కో కన్వీనర్ ఫటాను ఫరూక్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా సహాయం అందజేత

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ 11వ వార్డులో నివాసముం టున్న ముల్లా షాను అనే మహిళ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందింది. వైయస్సార్ బీమా పథకంలో భాగంగా తాత్కాలిక ఉపశమనం కింద శనివారం నామిని తాజుద్దీన్‌కి రూ.10 వేల తక్షణ సహాయాన్ని గ్రామ సర్పంచ్ లలిత చేతులమీదుగా సచివాల సిబ్బంది అందజేశారు.

ఓటు అనేది వజ్రాయుధం...

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల ఎస్‌వీ వీఎం డిగ్రీ కళాశాలలో ఓటు నమోదుపై శని వారం అవగాహన సద స్సును నిర్వహించారు డిప్యూటీ తహసీల్దార్‌రెడ్డి శేఖర్ ప్రసంగిస్తూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు పొందడం మనకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని, మనకు నచ్చిన నాయకుడిని, నచ్చిన ప్రభుత్వాని ఎన్నకోవడం కోసం ఓటు అనేది వజ్రా యుధంలా ఉపయోగపడుతుందన్నారు. కావున 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పౌరులు ఓటరుగా నమోదు చేసు కోవాలని, డిగ్రీ విద్యార్థు లకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఓటరు దినోత్సవంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ ఎస్‌పిఓలు ఆజాద్, బాల మోహన్, కళాశాల అధ్యాపకులు నందగోపాల్, శ్వేత పాల్గొన్నరు.

ఓటు ప్రాధాన్యాన్ని వివరించాలి..

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మండల తాహసిల్దార్ సురేష్ అధ్యక్షతన శనివారం పరిటల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు నూతనంగా ఓటు హక్కు వినియోగించుకుని యువతీ యువకుల కోసం కాలేజీ విద్యార్థుల కోసం కాలేజీలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ గ్రామాల్లో నిరక్షరాష్యులకు ఓటు ప్రాధాన్యత వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకరప్ప, ఈఓఆర్డీ శ్రీదేవి, ఎంఈఓ చంద్రశేఖర్, ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ హనుమంతు,సీనియర్ అసిస్టెంట్ గణేష్, వైస్ ప్రిన్సిపాల్ జయయప్ప పాల్గొన్నారు.

ఓటరు నమోదు పోలింగ్ కేంద్రాలు తనిఖీ

విశాలాంధ్ర-ఎన్‌పికుంట: మండలంలోని అన్ని పోలింగ్ బూత్ కేంద్రాలలో స్పెషల్ డ్రైవ్ భాగంగా శనివారం పోలింగ్ బూత్ లో ఓటర్ నమోదు ప్రత్యేక క్యాంపును తహసిల్దార్ నరేంద్ర కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్స రాలు పూర్తి అయ్యే వారిని కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.